నేటి దినపత్రిక
# సూర్య
18వ
www.suryaa.com
ఏలూరు జిల్లా, పశ్చిమ గోదావరి జిల్లా
శనివారం,18 జనవరి 2025 8 పేజీలు

## ప్రజల సంక్షేమం కోసమే నేటి దినపత్రిక 'సూర్య '

**- శాసనసభ్యులు చిర్రి బాలరాజు వెల్లడి**



**జీలుగుమిల్లి,మేజర్‌న్యూస్ :** నేటి దినపత్రిక సూర్య ప్రజల సంక్షేమం కోసం ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా నిలిచి పనిచేస్తుందని పోలవరం శాసనసభ్యులు చిర్రి బాలరాజు కొనియాడారు. శుక్రవారం నేటి దినపత్రిక సూర్య క్యాలెండర్‌ను బర్రింకలపాడులోని శాసనసభ్యుల క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలరాజు మాట్లాడుతూ సూర్య దినపత్రిక అధినేత నకారపు సూర్య ప్రకాష్ సారధ్యంలో 18 సంవత్సరాలుగా ప్రజా సంక్షేమం కోసం సూర్య దినపత్రిక కృషి చేస్తుందని సూర్య దినపత్రికలో పనిచేస్తున్న సిబ్బందికి యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. సర్పంచ్ వనమా రాంబాబు జనసేన నాయకులు రాయి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

### ప్రతి మూడో శనివారం

# స్వచ్ఛ ఆంధ్ర -స్వచ్ఛ దివస్

**- రానున్న నూరు రోజుల్లో అత్యంత పరిశుభ్ర జిల్లాగా ఏలూరు లక్ష్యం**
**-12 మాసాలకు 12 నినాదాలతో కార్యక్రమ నిర్వహణకు చర్యలు**





**ఏలూరు,మేజర్‌న్యూస్:** స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివాస్ కింద రానున్న వందరోజుల్లో అత్యంత పరిశుభ్ర జిల్లాగా ఏలూరు జిల్లాను తీర్చిదిద్దేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ లో 'స్వచ్ఛ ఆంధ్ర -స్వచ్ఛ దివాస్' కార్యక్రమం నిర్వహణపై సంబంధిత అధికారులకు కలెక్టర్ వెట్రిసెల్వి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ఈకార్యక్రమం పటిష్టవంతంగా అమలుచేసేందుకు ఆయాశాఖలవారీగా నోడల్ అధికారులను నియమించాలన్నారు. ఏలూరు నగరంలో శనివారం పాత బస్టాండు ప్రాంతంలో స్వచ్ఛ ఆంధ్రా-స్వచ్ఛ దివాస్ కార్యక్రమ నిర్వహణకు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ కమీషనరును కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో భాగంగా శ్రమదానం, మానవహారం, ప్రతిజ్ఞ, ఆయా ప్రాంతాల్లోని పరిసరాలను పరిశుభ్రం చేయడం వంటి కార్యక్రమాలుపెద్దఎత్తున

- తరువాయి 2లో..



## అత్యంత పరిశుభ్ర జిల్లాగా

# తీర్చిదిద్దాలనేదే లక్ష్యం

**స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్' పేరిట ప్రతి**
**3వ శనివారం స్వచ్ఛతా కార్యక్రమాలు : జిల్లా కలెక్టర్**

**భీమవరం,మేజర్‌న్యూస్:** రాష్ట్ర ప్రభుత్వం పిలుపు మేరకు జిల్లాలో ఇకపై ప్రతి మూడో శనివారం "స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివాస్" కార్యక్రమాన్ని నిర్వహించేందుకు చర్యలు చేపట్టడమైందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ వశిష్ట సమావేశ మందిరం నందు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి వివిధ శాఖల జిల్లా అధికారులతో సమావేశమై ఈకార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు తగిన సూచనలు, ఆదేశాలను జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూఈకార్యక్రమ నిర్వహణకు సంబందించిన మార్గదర్శకాలను ఇప్పటికే ప్రభుత్వం జారీ చేయడం జరిగిందన్నారు. జిల్లా వ్యాప్తంగా విజయవంతంగా నిర్వహించేందుకు పట్టణ స్థాయి నుండి గ్రామ స్థాయి అధికారుల వరకు ప్రతి ఒక్కరూ అంకిత భావంతో భాగస్వామ్యులు కావాలని ఆమె

- తరువాయి 2లో..

### మున్సిపాలిటీల్లో అవసరమైన

# నిధుల మంజూరుకు కృషి

**- చింతలపూడి ఎమ్మెల్యే రోషన్‌తో సమీక్షించిన ఎంపీ మహేష్**





**ఏలూరు,మేజర్‌న్యూస్ :** మున్సిపాలిటీల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు అవసరమైన నిధుల మంజూరుకు తన వంతు కృషి చేస్తానని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తెలిపారు. ఏలూరు క్యాంపు కార్యాలయంలో చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్‌తో కలిసి చింతలపూడి, జంగారెడ్డిగూడెం మున్సిపల్ కమిషనర్లతో ఎంపీ మహేష్ కుమార్ శుక్రవారం సమీక్షసమావేశం నిర్వహించారు. చింతలపూడి, జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ ఎంపీ మహేష్ కుమార్ దృష్టికి తీసుకువచ్చారు. రూ.12 కోట్ల ఆదాయం కలిగిన జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీని గ్రేడ్ -2నుంచి గ్రేడ్-1గా వర్గోన్నతి కల్పించాలని పంపిన నివేదిక ప్రస్తుతం ప్రభుత్వ పరిశీలనలో ఉందని కమిషనర్ కె.వి రమణ

- తరువాయి 2లో..

## భారీగోతులతో,దుమ్ము,ధూళితో భీమడోలు బస్టాండ్

**- పట్టించుకోని ఆర్టీసీ అధికారులు**
**- ఆదాయ వనరుగా మాత్రమే చూస్తున్న ద్వారకా తిరుమల ఆలయ పెద్దలు ?**







**భీమడోలు,మేజర్‌న్యూస్:** భీమడోలు జంక్షన్‌లోని ఆర్టీసీ బస్టాండ్‌ను ఆర్టీసీ అధికారులు, ద్వారకా తిరుమల ఆలయ నిర్వాహకులు కేవలం ఆదాయ వనరుగా మాత్రమే చూస్తున్నారని, కనీస సౌకర్యాలు కల్పించకపోవడం దారుణం అని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్త ఖ్యాతిగాంచిన ద్వారకాతిరుమలక్షేత్రానికి చేరుకోవడానికి కేంద్ర బిందువు అయిన భీమడోలు బస్టాండ్ ఆవరణభారీ గోతులతో, బస్టాండ్ దుమ్ముకొట్టుకు పోయి ఇబ్బంది కరంగా, కళా విహీనంగా మారింది. స్థానికులు, ప్రయాణికులు,చినవెంకన్న భక్తులు ఎన్నిమార్లు అధికారులకు విన్నవించుకున్నా బస్టాండ్‌ను పట్టించుకున్న దాఖలాలు లేవు, బస్టాండ్ లోపలికి రావడానికి బస్సుడ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలోఅయితే అటుడ్రైవర్లు, బస్సు లోపలి ప్రయాణికులు బాధలువర్ణనాతీతం, ఈబస్టాండ్ కేవలం ద్వారకాతిరుమల ప్రయాణికులే కాకుండా స్థానిక 30 గ్రామాల ప్రజలు సుదూర ప్రాంతాలకు వెళ్ళేందుకు ఈబస్టాండ్‌ను వినియోగిస్తు న్నారు. అంతే కాకుండా అటు రాజమండ్రి,ఇటు ఏలూరు వైపు వేళ్లె ప్రయాణికుల సంఖ్యరోజురోజుకు పెరుగుతోంది. ఇటీవల బస్టాండ్

- తరువాయి 2లో..

# అత్యంత పరిశుభ్ర జిల్లాగా తీర్చిదిద్దాలనేదే లక్ష్యం

**మొదటిపేజి తరువాయి**

పిలుపునిచ్చారు. ఈ నెల నుండి వచ్చే 12 నెలల పాటు నెల కొక థీమ్ తో 12 మాసాలకు 12 థీమ్ లతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. జనవరి మాసంలో న్యూ ఇయర్ – క్లీన్ స్టార్ థీమ్ తోను, ఫిబ్రవరి మాసంలో సోర్సు – రిసోర్సు థీమ్ తోను, మార్చిలో అవాయిడ్ సింగిల్ యూజ్ ప్లాస్టిక్స్ – ప్రమోట్ రీయూజబుల్స్ థీమ్ తోను, ఏప్రిల్ లో ఇచెక్ థీమ్ థీమ్ తోను, మేలో నీరు–మీరు థీమ్ తోను, జూన్ లో బీట్ ది హీట్ థీమ్ తోను, జులై లో ఎండింగ్ ప్లాస్టిక్ పొల్యూషన్ థీమ్ తోను, ఆగస్టు లో మాన్ సూన్ హైజనిక్ థీమ్ తోను, సెప్టెంబరు లో గ్రీన్ ఏ.పి. థీమ్ తోను, అక్టోబరులో క్లీన్ ఎయిర్ థీమ్ తోను, నవంబరులో పెర్సనల్ అండ్ కమ్యునిటీ హైజిన్ థీమ్ తోను,డిశంబరు మాసంలో ఆపర్చునిటీస్ ఇన్ ఎన్విరాన్మెంట్ థీమ్ తోను ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని ప్రతి నియోజక వర్గంలో పెద్ద ఎత్తున ప్రజల భాగస్వామ్యంతో మానవహారాన్ని నిర్వహించాలని కోరారు. ప్రజాప్రతినిదులను,అన్ని వర్గాల ప్రజలను పెద్ద ఎత్తున భాగస్వామ్యులను చేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమ నిర్వహణలో పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి,మున్సిపల్ శాఖలు కీలక భూమిక పోషించాల్సి ఉందని,అందుకు తగ్గట్టుగా ఆయా శాఖల అధికారులు ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించే అంశంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆమె సూచించారు.

ఈ సమావేశంలో డిఆర్ఓ మొగిలి వెంకటేశ్వర్లు,జిల్లా గ్రామీణ నీటిసరఫరా అధికారి బి.వి.నాగేశ్వరరావు,డిపిఓ అరుణ శ్రీ,మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి,డ్వామా పిడి కే సిహెచ్ అప్పారావు,డిఆర్డిఏ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## 19న సూపర్ సిటిజన్‌లకు సన్మానం

**పాలకొల్లు,మేజర్‌న్యూస్:** సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పాలకొల్లు లయన్స్ ఆడిటోరియంలో 19వ తేదీ ఆదివారం సాయంత్రం 5 గంటలకు సూపర్ సిటిజన్స్‌కు సన్మానం చేస్తున్నట్లు సంఘ అధ్యక్షులు వంగా నరసింహారావు తెలిపారు. పాలకొల్లు పట్టణానికి 'సూపర్ సీనియర్ సిటిజన్స్' అయిన మాజీ మంత్రి చేగొండి హరరామ జోగయ్య, మాజీ ఎమ్మెల్యే లు అల్లు వెంకట సత్యనారాయణ, డా.త్సవటపల్లి సత్యనారాయణమూర్తి (డా. బాబ్జి) లకు ఘనంగా సన్మానం చేయనున్నట్లు వంగా తెలిపారు. ఈ సభకు జలవనరుల శాఖా మంత్రి డా. నిమ్మల రామానాయుడు ముఖ్య అతిథిగా విచ్చేయనున్నారని తెలిపారు. ఈ సభలో రాష్ట్ర సీనియర్ సిటిజన్స్ సంఘ అధ్యక్షులు వెంపరాల నారాయణమూర్తి, పాలకొల్లు ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు కారుమూర్తి వెంకట నరసింహారావు,స్థానిక శాఖ గౌరవ అధ్యక్షులు వేగేశ్న తిరుపతిరాజులు సన్మానకర్తలుగా వ్యవహరించ నున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కేవలం సీనియర్ సిటిజన్ కళాకారులచే "కళాతరంగిణి" అనే పేరుతో వినోద కార్యక్రమాలు జరుగుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కార్యదర్శి గుత్తుల సత్యనారాయణమూర్తి కోరారు.

## 22న నిరుద్యోగ యువతీ యువకులకు జాబ్ మేళా

**ఏలూరు,మేజర్‌న్యూస్:** జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయం (నేషనల్ కెరీర్ సర్వీసు), ఏలూరు వారి ఆధ్వర్యములో ఈ నెల 22వ తేది ఉదయం 9.30 గం.కు జిల్లా ఉపాధి కార్యాలయం, ఏలూరు నందు నిరుద్యోగ యువతీ యువకులకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి సి.మధుభుషనరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి జిల్లాలో శ్రీ సిటిలో గల (పశ్చిమ ఆసియలో అతి పెద్ద కాడ్బెరి చాకొలేట్ తయారి కంపెనీ) ప్రతినిధులు హాజరుకానున్నారన్నారు. ఈ కంపెనీలో టీం మెంబెర్ ట్రైనీగా పని చేయుటకు ఇంటర్మీడియట్/డిగ్రీ/డిప్లొమా/ఐ.టి.ఐ మొదటి ప్రయత్నంలో 50శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించి,18-22 సంవత్సరాల వయసు గల యువతీ యువకులు అర్హులన్నారు. అర్హత సాదించిన అభ్యర్ధులకు సంవత్సరానికి సుమారు 2.34 లక్షలు జీతం, పిఎఫ్,ఇఎస్ఐ సౌకర్యం. ఉద్యోగంలో సెలెక్ట్ అయిన వారికి ఉన్నత చదువులకు,స్కిల్ ట్రైనింగ్ కుడా అవకాసం ఇవ్వబడును. సబ్సిడీ మీద ఇతర సదుపాయాలు కల్పించబడును. సిటీకి సంబందించిన వివిధ ఇండస్ట్రీ ప్రతినిధులు పాల్గొంటారన్నారు. అర్హత కలిగిన విభిన్న ప్రతిభావంతులు (మూగ,చెవిటి) వారు పాల్గొనవచ్చున్నారు. యువతకు ప్రభుత్వము కల్పిస్తున్న ఉపాధి అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరముల కొరకు నెంబర్ 8886882032 ను సంప్రదించవచ్చని ఆయన తెలిపారు.

## రావులపాలెం డిపో నుండి మహా కుంభమేళాకు బస్సు

**రావులపాలెం,మేజర్‌న్యూస్ :** రావులపాలెం మరియు పరిసర గ్రామాల భక్తుల సౌకర్యార్థం రావులపాలెం డిపో నుండి మహాశివరాత్రికి కాశీలోని నూతన కాశీ విశ్వేశ్వర మందిరం దర్శనం మరియు మహాకుంభమేళా సందర్భంగా త్రివేణి సంగమంలో స్నానం చేయు విధంగా సూపర్ లక్సరి బస్సు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ కె.డి.ఎం.ఎస్. కుమార్ తెలియజేశారు. ఈ బస్సు శనివారం బయలుదేరి అరసవెల్లి, పూరీ క్షేత్రము, కోణార్క్, భువనేశ్వర్, జాజిపూర్, గయ, బుద్ధగయ, శిరోగయ, కాశీ క్షేత్రం, సీతామడి, ప్రయాగ, అయోధ్య, నైమిశారణ్యం దేవాలయాల దర్శనం అనంతరం మార్చి నెల మొదటి తారీకునకు రావులపాలెం చేరుకుంటుందని, టికెట్ ధర ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, రాత్రి టిఫిన్‌తో కలిపి రూ.12,800లు అని, ఈ సౌకర్యం భక్తులు వినియోగించుకోవాలని తెలుపుతూ మరిన్ని వివరాలు మరియు టికెట్స్ కొరకు అసిస్టెంట్ మేనేజర్ 7382911871కు సంప్రదించాలని కోరారు.

### శ్రీశ్రీ మరిడమ్మ అమ్మవార్కి పంచామృతాభిషేకం

**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** పెద్దాపురం పట్టణంలో వేంచేసియున్న శ్రీశ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారి దేవస్థానం నందు శుక్రవారం ఆలయ అసిస్టెంట్ కమీషనర్ కె.విజయలక్ష్మీ ఆధ్వర్యంలో వేదపండితులు మరిడమ్మ అమ్మవార్కి ప్రాకార మండపంలో ప్రత్యేక వేదికపై జన్మ నక్షత్రం మఖ నక్షత్రం సందర్భంగా పంచామృతాభి షేకం, పసుపు, కుంకుమ, చందనం, విభూదిలతో ప్రత్యేక అభిషేకం నిర్వహించి, అనంతరం స్వర్ణ, రజతాలతో ప్రత్యేక పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు.

## మంత్రి నాదెండ్లను కలిసిన కొవ్వూరు జనసేన నాయకులు

**కొవ్వూరు, మేజర్ న్యూస్ :** రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కొవ్వూరు నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు శుక్రవారం ఏలూరులో మర్యాదపూర్వకంగా కలుసుకొని ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి సాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా కొవ్వూరు జనసేన పార్టీ మండల అధ్యక్షులు సుంకర సత్తిబాబు మాట్లాడుతూ ప్రమాదాల్లో మరణించిన జనసేన క్రియాశీలక సభ్యుల కుటుంబాలకు జనసేన పార్టీ తరుపున పి.ఎస్.పి చైర్మన్ నాదెండ్ల మనోహర్ 5 లక్షల రూపాయల చెక్కును అందజేయడం జరిగిందన్నారు. జనసేన పార్టీ క్రియాశీలక సభ్యులకు ఎటువంటి ఆపద వచ్చిన జనసేన పార్టీ వారి కుటుంబాలను ఆదుకుంటుందని వారి కుటుంబాలకు భరోసాగా ఇస్తుందని తెలియజేశారు. జనసేన పార్టీ అధినేత రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశానుసారం ప్రమాదంలో మరణించిన కుటుంబాలను ఆదుకోవడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు నియోజకవర్గ జనసేన పార్టీ సీనియర్ నాయకులు గంగుమళ్ళ స్వామి, కొవ్వూరు మండల ప్రధాన కార్యదర్శి మైగాపుల బాలకృష్ణ, కొవ్వూరు మండల కాపకాయల సతీష్ పాల్గొన్నారు.

## పెద్దాపురంలో జాతీయ చదరంగ పోటీలు ప్రారంభం

**– పాల్గొన్న ఎమ్మెల్యే చినరాజప్ప**

**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** కాకినాడ జిల్లా, పెద్దాపురంలో గల శ్రీప్రకాష్ విద్యా సంస్థల ఆవరణలో 13వ జాతీయ స్థాయి ఛాంపియన్‌షిప్ పోటీలను పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈచదరంగం పోటీలు పెద్దాపురంలో నిర్వహించడం గర్వించదగ్గ విషయమని, ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఛైర్మన్ రాజా సూరిబాబురాజు, శ్రీప్రకాష్ విద్యా సంస్థలు అధినేత విజయ్ ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు. ఈ చదరంగ పోటీలలో దేశంలోని పలు రాష్ట్రాల నుండి చెస్ క్రీడాకారులు పాల్గొన్నారు.

## సుబ్బాయమ్మపేటలో అవేర్‌నెస్ క్యాంప్

**కాకినాడ, మేజర్ న్యూస్ :** కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ప్రతి గ్రామంలోనూ అవేర్నెస్ క్యాంపైన్లు ద్వారా ప్రజల్లో వివిధ రకాల సైబర్ మోసాలు, ఇంటి దొంగతనాల నివారణ, బ్యాగ్ లిఫ్టింగ్ నేరాల గురించి, మోటార్ సైకిల్ దొంగ తనాల గురించి, వివిధ రకాల చీటింగులు, మహిళా రక్షక్ అవేర్నెస్, డ్రగ్స్ వద్దు బ్రో, రోడ్డు ప్రమాదాల నివారణల మీద అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించిన మీదట శుక్రవారం గండేపల్లి మండలం సుబ్బాయమ్మపేట గ్రామంలో గ్రామ సభ నిర్వహించడం జరిగింది. ఈసభలో ఇంటి నేరాలు నివారణ, డ్రగ్స్ వద్దు బ్రో, సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాల నివారణ, ఇంటి దొంగతనాలు మోటార్ సైకిల్ దొంగతనాలు, బ్యాక్ లిఫ్టింగ్ దొంగతనాల నివారణ గురించి, మహిళా రక్షణ అవేర్నెస్ గురించి గ్రామ పెద్దలందరికీ తెలియజేయడం జరిగింది.

### ప్రతి మూడో శనివారం

## స్వచ్ఛ ఆంధ్ర -స్వచ్ఛ దివస్

**మొదటిపేజి తరువాయి**

చేపట్టాలన్నారు.ఈసమయంలో ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈకార్యక్రమాల్లో స్థానికులను,కళాశాల విద్యార్ధులను,వాకర్స్ అసోషియేషన్స్‌లను, స్వచ్ఛంధసంస్థలను, ప్రజాప్రతినిధులను పెద్దఎత్తున భాగస్వామ్యం చేయాలన్నారు.ప్లాస్టిక్ వినియోగ నియంత్రణకు అవసరమై న చర్యలు తీసుకోవాలన్నారు.నగరంలోని హాకర్స్,ఇతర ఆహార పదార్ధాల విక్రయాలకు సంబంధించిన షాపులను హెల్త్ ఇస్పెక్టర్లతో గుర్తించి వాటిలో ఆహార పదార్ధాలు హ్యాండ్లింగ్ పరిశుభ్రత పాటించడం వంటి అంశాలను పరిగణలోకి తీసుకొని ఆయా షాపులకు ఒకటి నుంచి పది వరకు ర్యాంకులను ఇవ్వాలన్నారు. ముఖ్యంగా మార్కెట్,బస్టాండు, రైల్వేస్టేషన్ తదితర పరిసరాలు పరిశుభ్రతతో ఉండేలా పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు.

వీలైన చోట్లా మొక్కలనునాటేందుకు అవసర మైన చర్యలు తీసుకోవాలన్నారు.సమావేశంలో జెడ్పి సిఇఓ కె.సుబ్బా రావు, నగరపాలక కమీషనరు ఎ.భానుప్రతాప్,డిపివో కె. అనురాధ, డిఇఓ వెంకటలక్ష్మమ్మ, ఇన్‌చార్జి ఉపరవాణా కమీషనరు కెఎస్‌ఎంవి కృష్ణారావు, ఆర్‌టిసి పిఆర్వో నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీల్లో అవసరమైన నిధుల మంజూరుకు కృషి

**మొదటిపేజి తరువాయి**

ఎంపీ మహేష్ కుమార్‌కు వివరించారు. అనంతరం ఎంపీ మహేష్ కుమార్ మాట్లాడుతూ మున్సిపాలిటీల్లో మౌలిక వసతులు కల్పనకు ఎమ్మెల్యే రోషన్ కుమార్ తో కలిసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి సాధ్యమైనంత ఎక్కువ నిధులు రాబట్టేందుకు కృషి చేస్తున్నట్లు ఎంపీపేర్కొన్నారు. జంగారెడ్డి గూడెం మున్సిపాలిటీలో భూగర్భ మురుగునీటి పారుదల వ్యవస్థ నిర్మాణానికి రూ. 80 కోట్లతో, సెంట్రల్ లైటింగ్, పార్కుల అభివృద్ధి, ఇతరత్రా పనులు చేపట్టేందుకు రూ.50 కోట్లు, చింతలపూడి మున్సిపాలిటీలో అభివృద్ధి పనులకు రూ.42 కోట్లు, కొయ్యలగూడెం నగర పంచాయతీలో భూగర్భ మురుగునీటి పారుదల వ్యవస్థ నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు ఎంపీ మహేష్ కుమార్ తెలిపారు. రానున్న బడ్జెట్లో నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరినట్లు ఎంపీ స్పష్టం చేశారు.

## భారీగోతులతో,దుమ్ము,ధూళితో భీమడోలు బస్టాండ్

**మొదటిపేజి తరువాయి**

పరిస్థితి బాగోకపోవడం సౌకర్యాలు లేకపోడంతో ఎక్స్ ప్రెస్‌లు సైతం బైపాస్ వైపు నుంచి వెళ్లిపోవడంతో ఎక్స్ ప్రెస్ సర్వీసులు లేక స్థానికులు, శ్రీవారి భక్తులు తీవ్ర ఇబ్బదులు పడుతున్నారని, ఇప్పటికైనా ద్వారకాతిరుమల ఆలయ నిర్వాహకులు కానీ,ఆర్టీసీ అధికారులు గానీ వంతులు వేసుకోకుండా బస్టాండ్ ఆవరణలో సిమెంట్ రోడ్డు వేసి, కనీస సౌకర్యాలు ఏర్పాటు చెయ్యాలని,ఆర్టీసీ అధికారులు గతంలో వలె ఎక్స్ ప్రెస్ బస్సులు నిలుపుదల చెయ్యాలని కోరుతున్నారు.

## రోడ్డు ప్రమాదాలపై అవగాహన

**కొవ్వూరు,మేజర్‌న్యూస్ :** నిర్లక్ష్యంగా వాహనాలను నడపడం వలన రోడ్డు ప్రమాదాలకు గురై ప్రాణాలను కోల్పోతున్నారని, రోడ్డు ప్రమాదాలను నివారించడంలో ప్రతి వాహనదారుడు బాధ్యతగా వ్యవహరించాలని కొవ్వూరు పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ పి.విశ్వం తెలిపారు. జనవరి 11 నుంచి జనవరి 17 వరకు నిర్వహించు ప్రపంచ రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా శు క్రవారం కొవ్వూరు ఆర్టీసీ డిపో మేనేజర్ వై.వి.వి.ఎన్ కుమార్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ పి.విశ్వం మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపరాదని, ద్విచక్ర వాహనాలు నడిపే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని అన్నారు. రోడ్డు భద్రత ప్రమాణాలను పాటిస్తూ వాహనాలను నడపాలని అన్నారు. ప్రతి వాహనదారుడు ఇంటి నుండి బయటకు వెళ్లి సమయంలో తనకోసం ఎదురుచూస్తున్న తమ కుటుంబ సభ్యులను గుర్తు చేసుకోవాలని తెలిపారు.

# మృత్యు మార్గాలుగా మారిన కల్వర్టులు





- జాతీయ రహదారి నిర్వహణ అధికారులపై కఠిన చర్యలు తీసుకోండి
- ప్రమాదాల్లో మృత్యువాత పడిన కుటుంబ సభ్యులు డిమాండ్

**జీలుగుమిల్లి,మేజర్ న్యూస్ :** జాతీయ రహదారిలో సరైన రక్షణ లేకుండా కల్వర్టులు నిర్మించి అధికారులు వదిలేస్తే అనేకమంది వాటిలో పడి మరణించడంతో కుటుంబాలు చిన్నా భిన్నమవుతున్నాయని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే ఉన్నత అధికారులు స్పందించి జాతీయ రహదారి నిర్వహణ అధికారుల పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. జీలుగుమిల్లి మండలంలో లక్ష్మీపురం, దర్భ గూడెం గ్రామాలమీదుగా వెళుతున్న తల్లాడ దేవరపల్లి జాతీయ రహదారిని గత మూడేళ్ల క్రితం నిర్మించారు. రహదారిలో వరద నీరు పోయేందుకు నూతనంగా కల్వర్టులు నిర్మించారు. ఆ కలవర్టులు నిర్మించిన చోట సరైన రక్షణ చర్యలు గాని సూచిక బోర్డులు కానీ ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు జరిగి అనేకమంది మరణిస్తున్నారని స్థానికులు కుటుంబ సభ్యులు పేర్కొంటున్నారు. లక్ష్మీపురం గ్రామం వద్ద కల్వర్టుకు ఎటువంటి రక్షణ గాని సూచిక బోర్డులు లేకపోవడంతో ఈనెల 15వ తేదీన గరటం హరీష్ తన మోటార్ సైకిల్‌తో పాటు కల్వర్టులో ప్రమాదవశాత్తుపడిపోయి మరణించాడు. అతనికి భార్య పిల్లలు ఉన్నారు కుటుంబ భారమంతా హరీష్ పైనే ఇప్పుడు తమ కుటుంబాన్ని ఆదుకునే వారెవరు అంటూ ప్రశ్నిస్తున్నారు. ఈ కల్వర్టుకు ఇరువైపులా రక్షణ కల్పించినట్లయితే హరీష్ బ్రతికేవాడని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మరణానికి కేవలం జాతీయ రహదారి నిర్వహణ అధికారుల లోపమే కారణమని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు. జాతీయ రహదారి నిర్మాణంలో ఎన్నో రక్షణ చర్యలు తీసుకోవాల్సి ఉన్న వాటిని పరిగణలోకి తీసుకోకుండా అధికారులు తమ కుటుంబ సభ్యులను బలి చేస్తున్నారని వాపోతున్నారు. తక్షణమే ఉన్నత అధికారులు, న్యాయస్థానాలు ఇటువంటి సంఘటనలను సుమోటో కేసులుగా స్వీకరించి జాతీయ రహదారుల నిర్వహణ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధ్యత కుటుంబ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు.

# రీ సర్వేపై పూర్తి అవగాహన కలిగి ఉండాలి

- రెవెన్యూ అధికారులకు జేసి రాహుల్ కుమార్ రెడ్డి సూచన



**భీమవరం,మేజర్ న్యూస్:** శుక్రవారం భీమవరం రెవెన్యూ డివిజన్ పరిధిలో తహసిల్దార్లు, మండల సర్వేలు, డీటీలు వీఆర్వోలుకు భీమవరం ఎస్.ఆర్.కె.ఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియంలో నాలుగో దశ రీ సర్వే పనులు ప్రారంభం పై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సదస్సులో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రీ సర్వే పై రెవిన్యూ అధికారులు తప్పక పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. రికార్డులు పారదర్శక గా నిర్వహించాలని చెప్పారు. రీ సర్వేపై విపులంగా పలు సూచనలు, సలహాలను తెలిపారు. విలేజి బౌండరీ ఖచ్చితంగా పాటించాలన్నారు. ప్రభుత్వ భూములు సంబంధించి శాఖల వారీగా ఇరిగేషన్, డ్రైనేజీ, దేవస్థానం జిల్లా పరిషత్ భూములకు సంబంధించి ముందుగా నోటీసులు ఇచ్చి సర్వే నిర్వహించాలన్నారు. రైతు వారి భూములుకు సంబంధించినవి ముందుగా నోటీసులు ఇచ్చి రైతులు ఆధ్వర్యంలో సర్వేలు చేయాలని సంబంధిత శాఖల అధికారులకు జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో ఆర్డిఓ కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, ఇంచార్జ్ జిల్లా సర్వే అధికారి కె.శ్రీనివాస్, డివిజన్ సర్వే అధికారులు మల్లికార్జునరావు, రాంబాబు, భీమవరం రెవిన్యూ డివిజన్ తహసిల్దార్లు, మండల సర్వేలు, డీటీలు, వీఆర్వోలు, వీఆర్ఏలు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే బాలరాజుతో ఐటిడిఎ పిఓ భేటీ

**జీలుగుమిల్లి,మేజర్‌న్యూస్:** ఐటీడీఏ పి.ఓగా నియమితులైన రాములు నాయక్ శుక్రవారం ఎమ్మెల్యే కార్యాలయం బర్రింకలపాడు నందు శాసనసభ్యులు చిర్రి బాలరాజుని మర్యాదపూర్వకంగా కలిశారు. ఐటిడిఎ అంశాలపై చర్చించారు.




# ఉత్తమ రైతు అవార్డు గ్రహీత వీర రాఘవరెడ్డి అస్తమయం



**పెంటపాడు,మేజర్ న్యూస్ :** పెంటపాడు మండలం ముదునూరు సొసైటీ మాజీ అధ్యక్షులు, రాష్ట్ర రైతు కార్యచరణ సమితి ఉపాధ్యక్షులు, సర్ ఆర్థర్ కాటన్ రైతు క్లబ్ అధ్యక్షులు, రాష్ట్ర ఉత్తమ రైతు అవార్డు గ్రహీత నల్లమిల్లి వీర రాఘవరెడ్డి (76) శుక్రవారం వేకువ జామున మృతి చెందారు. రాఘవరెడ్డికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమారుడు గని రెడ్డి, రెండవ కుమారుడు విజయానందరెడ్డి (అంజిరెడ్డి). అంజిరెడ్డి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగపు జిల్లా నాయకులు. రాఘవ రెడ్డి పెంటపాడు రాజకీయాలలో ప్రముఖ పాత్ర పోషిస్తూ వచ్చారు. రాష్ట్ర రైతు కార్యచరణ సమితి ఉపాధ్యక్షులుగా రైతు ఉద్యమాల్లో పాల్గొన్నారు. వ్యవసాయ రంగంలో ఆయన చేసిన కృషికి గాను రెండు పర్యాయాలు రాష్ట్ర ఉత్తమ రైతు అవార్డును అందుకున్నారు. స్వాతంత్ర,గణతంత్ర దినోత్సవ సందర్భంగా జిల్లా స్థాయిలో ఉత్తమ రైతు అవార్డును అప్పటి జిల్లా కలెక్టర్ చేతుల మీదగా పలు పర్యాయాలు అందుకున్నారు. ప్రతి ఏట సర్ ఆర్థర్ కాటన్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేవారు. కాటన్ పేరు మీద పలు సేవా కార్యక్రమాలు చేయడమే కాకుండా, విద్యార్థులకు పోటీ పరీక్షలు నిర్వహించి వారికి అవార్డులను అందజేసేవారు. మండల స్థాయిలో ఆదర్శ రైతులను గుర్తించి వారికి సన్మాన సత్కారాలను నిర్వహించేవారు.

- ఘనంగా అంత్యక్రియలు –రాష్ట్ర ఉత్తమ రైతు అవార్డు గ్రహీత నల్లిమిల్లి వీరాగ రాఘవరెడ్డి అంత్యక్రియలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పెంటపాడు రెడ్డి స్మశాన వాటికలో ఆయన భౌతికాయానికి అంత్యక్రియలు నిర్వహించారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రైతు విభాగపు అధ్యక్షులు వడ్డీ రఘురాం నాయుడు, తాడేపల్లిగూడెం జడ్పిటిసి ముత్యాల ఆంజనేయులు, తాడేపల్లిగూడెం వ్యవసాయ సహాయ సంచాలకులు పి మురళీకృష్ణ పడమర సొసైటీ మాజీ అధ్యక్షులు పసల అచ్యుత సత్యనారాయణమూర్తి, తెలుగు మహిళ జిల్లా నాయకురాలు కొండ్రెడ్డి హైమావతి, స్థానిక ఎంపిటిసి రెడ్డి సూరిబాబు, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు పెద్ద ఎత్తున అంత్యక్రియలలో పాల్గొన్నారు

## శృంగవృక్షంలో గుర్తు తెలియని మృతదేహం



**పాలకోడేరు మేజర్ న్యూస్,** శృంగావృక్షం గ్రామంలోని ఎఫ్ సిఐ రోడ్‌లో గల పంట బోదే లో గుర్తు తెలియని మృత దేహాన్ని కనుగొన్నారు. తనకు అందిన సమాచారం మేరకు అక్కడకు వెళ్ళి చూడగా సుమారు 50-55 సంవత్సరాల వయసు గల పురుషుని మృత దేహం పంట బోధే లోని నీటిలో బోర్లా పడి వుందని శృంగవృక్షాం విఆర్‌వో 2 దేవదాసు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రవి వర్మ తెలిపారు. ఎవరైనా ఆచూకీ తెలిసిన వారు వెంటనే పాలకోడేరు పోలీసులకు తెలియ జేయాలని తెలిపారు.

## ఐటీడీఏ పీవోగా శ్రీరాములు నాయక్ బాధ్యతలు స్వీకారం



**బుట్టాయిగూడెం,మేజర్‌న్యూస్:** ఐటీడీఏ పీవోగా కె.రాములు నాయక్ శుక్రవారం పదవి బాధ్యతలు చేపట్టారు. ఆయన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా వివిధ ప్రాంతాల్లో పనిచేశారు. కృష్ణాజిల్లా సర్వ శిక్ష అభియాన్‌లో ఉన్నతాధికారిక పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇప్పటివరకు ఐటీడీఏ పీవోగా జిల్లా జాయింట్ కలెక్టర్ ధాత్రి రెడ్డి బాధ్యతలు నిర్వహించారు. ఆమె 2024 ఆగస్టు 15 బాధ్యతలు చేపట్టి ఇప్పటివరకు పిఓగా బాధ్యతలు నిర్వహించారు.కొత్తగా బాధ్యతలు చేపట్టిన రాములు నాయక్ శాసనసభ్యులు చిర్రి బాలరాజుని,రాష్ట్ర ట్రైకర్ చైర్మన్ బొరగం శ్రీనివాస్‌ని మర్యాదపూర్వకంగా కలిశారు.

## బ్యాంక్ ఆఫ్ బరోడా సహకారంతో హెల్మెట్‌లు అందజేత



**నర్సాపురం,మేజర్‌న్యూస్ :** రాష్ట్ర న్యాయ సేవాదికారసంస్థ ఆదేశాల మేరకు ,నర్సాపురం మండల న్యాయ సేవాధికారా సంస్థ ఛైర్ పర్సన్,10వ అధనపు జిల్లా న్యాయమూర్తి పి. విజయ దుర్గ ఆధ్వర్యంలో బ్యాంక్ ఆఫ్ బరోడా సౌజన్యంతో శుక్రవారంస్థానిక కళ్యాణి రూరల్ రిహాబిలిటేషన్ ఎడ్యుకేషనల్ సొసైటీ కి చెందిన మౌనిక గౌరీకి బ్రెయిలీ కిట్‌ను అందించారు. శిరస్త్రాణం లేనివారిని గుర్తించి నాలుగురికి శిరస్త్రాణాలను అందించారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ ఆఫ్ బరోడా చీఫ్ మేనేజర్ జ్యోతిర్మయి, కళ్యాణి స్పెషల్ టీచింగ్ సెంటర్ కరస్పాండెంట్ ఎ.నళిని దేవి తదితరులు పాల్గొన్నారు.

## కండక్టర్ మార్పులతో కానుమోలు కేంద్రం నుండి విద్యుత్ సరఫరా

**ఏలూరు,మేజర్ న్యూస్:** భీమడోలు - పెదవేగి ఫీడర్ ప్రస్తుతం ఉన్న కండక్టర్ మార్పు చేయుటకు 18వ తేదీ నుండి 31 వరకు,132 కెవి భీమడోలు - ఏలూరు ఫీడర్ ప్రస్తుతం ఉన్న కండక్టర్ మార్చుటకు ఫిబ్రవరి 1నుండి 15వ తేదీ వరకు కండక్టర్ మరమత్తులు పనులు జరుగుతాయి.

కండక్టర్ మరమత్తుల పనులు జరిగే సమయంలో 132కెవి పెదవేగి,132కెవి ఏలూరు వంగాయగూడెం విద్యుత్ కేంద్రాలకు, 132కెవి కానుమోలు విద్యుత్ కేంద్రం నుండి సరఫరా ఏర్పాటు చేయడం జరిగింది. కనుక ఒకవేళ ఏదయినా సాంకేతిక లోపంవలన 132కెవి కానుమోలు విద్యుత్ కేంద్రం నుండి అంతరాయం కలిగితే, ప్రజలు సహకరించవలసినదిగా తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఏలూరు ఆపరేషన్ సర్కిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.ఎం.అంబేద్కర్ ఒక ప్రకటనలో తెలియజేశారు.

# స్వచ్ఛత ప్రాధాన్యంపై అవగాహన కల్పించాలి

– గ్రామస్థాయి నుంచి ప్రతి ఒక్కరిని భాగస్వామ్యం చేయాలి
– స్వచ్ఛత పాటింపులో ఉత్తమంగా నిలిచే
మండలానికి రోలింగ్ ట్రోఫీ



**ఏలూరు,మేజర్ న్యూస్ :** జిల్లా వ్యాప్తంగా స్వచ్ఛ ఆంధ్ర –స్వచ్ఛ దివాస్ కార్యక్రమాన్ని గ్రామ స్థాయి నుండి మండల స్థాయి అధికారుల వరకూ ప్రతి ఒక్కరూ అంకిత భావంతో భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి పిలుపునిచ్చారు. శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి వివిధ శాఖల జిల్లా అధికారులు, డివిజన్, మండలస్థాయి అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్సు నిర్వహించి ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు తగిన సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇకపై ప్రతి మూడో శనివారం 'స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివాస్' కార్యక్రమాన్ని వినూత్న ఆలోచనలతో జిల్లావ్యాప్తంగా విజయవంతంగా నిర్వహించాలన్నారు. జనవరి నెల నుంచి ప్రారంభించే కార్యక్రమాన్ని న్యూఇయర్ క్లీన్ స్టార్ట్ థీమ్‌తో ప్రారంభించుకోవడం జరుగుతుందన్నారు. ఈ విధంగా ఈ నెల నుండి వచ్చే 12 నెలల పాటు నెల కొక థీమ్ తో 12 మాసాలకు 12 థీమ్ లతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. జనవరి మాసంలో న్యూ ఇయర్ – క్లీన్ స్టార్ థీమ్ తోను, ఫిబ్రవరి మాసంలో సోర్సు–రిసోర్సు థీమ్ తోను,మార్చిలో అవాయిడ్ సింగిల్ యూజ్ ప్లాస్టిక్స్ – ప్రమోట్ రీయూజబుల్స్ థీమ్ తోను,ఏప్రిల్ లో ఇ–వేస్ట్ థీమ్ తోను, మేలో నీరు–మీరు థీమ్ తోను, జూన్‌లో బీట్ ది హీట్ థీమ్ తోను, జులై లో ఎండింగ్ ప్లాస్టిక్ పొల్యూషన్ థీమ్ తోను, ఆగస్టు లో మాన్ సూన్ హైజనిక్ థీమ్ తోను, సెప్టెంబరు లో గ్రీన్ ఏ.పి. థీమ్ తోను, అక్టోబరులో క్లీన్ ఎయిర్ థీమ్ తోను, నవంబరులో పెర్సనల్ అండ్ కమ్యూనిటీ హైజిన్ థీమ్ తోను, డిసెంబరు మాసంలో ఆపర్చునిటీస్ ఇన్ ఇన్విరాన్మెంట్ థీమ్ లతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు. ఈ విషయంలో ప్రతినెలా ఉత్తమంగా నిలిచిన మండలానికి రోలింగ్ ట్రోఫి అందించడం జరుగుతుందన్నారు.ప్లాస్టిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. అదే విధంగా రంగవల్లుల పోటీలను కూడా చేపట్టాలన్నారు. గ్రామాల ముఖద్వారం ప్రాంతాల్లో చెత్తపేరుకుపోకుండా పరిశుభ్ర వాతావరణం ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. పెద్ద ఎత్తున ప్రజల భాగస్వామ్యంతో శ్రమదానం, మానవ హారాన్ని నిర్వహించాలని సూచించారు. ప్రతిజ్ఞ కార్యక్రమాలను కూడా నిర్వహించాలన్నారు. ఎన్ఎస్ఎస్, ఎన్ సిసి విద్యార్థులను కూడా భాస్వామ్యం చేయాలన్నారు. సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి వి. విశ్వేశ్వరరావు, జెడ్పి సిఇఒ కె.సుబ్బారావు తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

# వ్యవసాయానికి పగలు 9గంటలు విద్యుత్ సరఫరా చేయాలి




**ఏలూరు,మేజర్ న్యూస్:** వ్యవసాయానికి పగలు 9 గంటలు విద్యుత్ సరఫరా చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఏలూరు అన్నే భవనంలో వ్యవసాయ విద్యుత్ సమస్యలపై సంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయానికి విద్యుత్ సరఫరా 9గంటలు నుండి 7గంటలకు కుదించడంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయానికి 7 గంటల విద్యుత్ ఇవ్వడం వలన పంటలపై తీవ్ర ప్రభావం చూపిస్తుందని చెప్పారు. మెట్ట ప్రాంతంలో మొక్కజొన్న, మిర్చి, వర్జినియా పొగాకు పంటలతోపాటు ఉద్యాన పంటల రైతులు ఇబ్బందులు పడతారని చెప్పారు. కొన్ని పంటల దిగుబడిపై ప్రభావం ఉంటుందన్నారు. వ్యవసాయానికి పగలు 9 గంటల విద్యుత్ సరఫరా చేయాలని కోరారు. అప్రకటిత విద్యుత్ కోతలపై అన్నదాతలు ఆందోళన చెందుతున్నారని ప్రభుత్వ వెంటనే జోక్యం చేసుకొని 9 గంటలు విద్యుత్ సరఫరా చేయకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.కొత్తగా బోర్లు వేసుకున్న రైతులకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలని కోరారు. ఈసమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సిరి బత్తుల సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

# పదోన్నతి పొందిన డ్రైవర్లకు వేతనాలు చెల్లించాలి

– ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు




**ఏలూరు,మేజర్ న్యూస్:** ఏలూరు నగర పాలక సంస్థ ప్రజారోగ్య శాఖ,ఇంజనీరింగ్ శాఖలో పని చేస్తూ హెవీ వెహికల్ డ్రైవర్లుగా పదోన్నతి పొందిన డ్రైవర్లకు పదోన్నతి పొందిన వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు.శుక్రవారం స్థానిక ఏఐటీయూసీ జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవనం నందు జరిగిన విలేకరుల సమావేశంలో బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 2022 మార్చి 30వ తేదీన నగరపాలక సంస్థ ప్రజారోగ్య శాఖలో పనిచేస్తున్న 8, ఇంజనీరింగ్ శాఖలో పనిచేస్తున్న ఒకరికి హెవీ వెహికల్స్ డ్రైవర్లుగా పదోన్నతి ఇవ్వడానికి నగరపాలక సంస్థ ఆమోదం తెలిపిందన్నారు. రవాణా శాఖ,స్టాండింగ్ కౌన్సిల్ తమ అనుమతులు జారీ చేసిన తర్వాత నగరపాలక సంస్థ ఆదేశాలు జారీ చేసిందని, ఆనాటి నుండి నేటి వరకు అనగా 34 నెలలుగా పదోన్నతి పొందిన డ్రైవర్లకు డ్రైవర్ల స్కేల్ ప్రకారం వేతనాలు చెల్లించకుండా,వర్కర్లకు చెల్లించే విధంగా వేతనాలు చెల్లిస్తున్నారని ఆరోపించారు. వార్షిక ఇంక్రిమెంట్లు, అడాక్ ఇంక్రిమెంట్లు ఇవ్వకుండా 9 మంది డ్రైవర్లకు జీతభత్యాలలో లక్షలాది రూపాయలు నష్టం కలిగించారని విమర్శించారు. నగరపాలక సంస్థ మేయర్, కమిషనర్,అదనపు కమిషనర్,కు పలుమార్లు విజ్ఞప్తి చేసినా పెడచెవిని పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. డ్రైవర్ల సమస్య పరిష్కారం కానిపక్షంలో ఫిబ్రవరి మొదటి వారం నుండి ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ప్రత్యక్ష ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి,ఏఐటీయూసీ ఏరియా కార్యదర్శి ఏ అప్పలరాజు మాట్లాడుతూ పదోన్నతి పొందిన డ్రైవర్లకు వర్కర్ల జీతాలు చెల్లిస్తూ వెట్టి చాకిరి చేయించుకుంటున్నారని విమర్శించారు. ఈ విలేకరుల సమావేశంలో తాడేపల్లి శేఖర్, అంతర్వేది శేఖర్,ఎ.బి. ఆంథోనీ పాల్, పంతం వెంకటేశ్వరరావు,గాడి అప్పారావు, మోదుగు గోవిందు, పాల్గొన్నారు.

## శ్రీదేవి మహంకాళమ్మ తల్లి వార్షికోత్సవంలో పాల్గొన్న ఉమర్ అలీషా

– ప్రత్యేక పూజలు చేసిన మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ




**తాడేపల్లిగూడెం, మేజర్ న్యూస్ :** తాడేపల్లిగూడెం కొబ్బరితోటలో వేంచేసియున్న శ్రీదేవి మహంకాళమ్మ తల్లి 45వ వార్షిక జాతర మహోత్సవాల్లో భాగంగా 5వ రోజు శుక్రవారం రాత్రి విశ్వ విజ్ఞాన ఆధ్యాత్మిక పీఠాధిపతి, మతాతీత మానవతామూర్తి బ్రహ్మర్షి శ్రీ ఉమర్ అలీషా ఆధ్యాత్మిక ప్రసంగం జాతర పందిరిలో కొనసాగింది. ఉమర్ అలీషా ఆధ్యాత్మిక ప్రవచనాలు వినడానికి భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసారు. శ్రీదేవి మహంకాళమ్మతల్లి ని దర్శించుకున్న మాజీ దేవాదాయ ధర్మాదాయ శాఖామాత్యులు కొట్టు సత్యనారాయణ నంద్యాల క్రిష్ణమూర్తి, గట్టిం మాణి క్యాలరావు, కర్రి సీతారామయ్య, బొద్దాని శ్రీనివాస్, వెలనాటి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలను నవోదయ ఫ్రెండ్స్ యూనియన్ అధ్యక్షులు యెగ్గిన నాగబాబు, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

## గంగాలమ్మను దర్శించుకున్న ప్రభుత్వ విప్



**నరసాపురం రూరల్,మేజర్ న్యూస్:** మండలంలోని ఎల్బీచర్ల గ్రామంలో గంగాలమ్మ జాతర మహోత్సవాలు శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. పరిసర ప్రాంత గ్రామాలనుండి పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

## ఘనంగా పోలిశెట్టి కుటుంబ ఆత్మీయ కలయిక



**నరసాపురం,మేజర్ న్యూస్ :** పోలిశెట్టి కుటుంబ ఆత్మీయ సమావేశం స్థానిక తెలగ కళ్యాణ మండపంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉభయ రాష్ట్రాల లోని హైదరాబాద్ , వరంగల్ ,మంగళగిరి,విశాఖపట్నం, రాజమండ్రి, పాలకొల్లు, భీమవరం,వీరవాసరం,చల్లపల్లి,గూడాల, కాకినాడ, తదితర ప్రాంతాల్లో స్థిరపడ్డ పోలిశెట్టి వారు కుటుంబ సభ్యులతో వందల సంఖ్యలో హాజరయ్యా రు.నరసాపురం మండలంలోని కొప్పర్రు గ్రామంలో గల శ్రీ శ్రీ పద్మాల వెంకమ్మ అమ్మవారి ఆశీస్సులతో నిర్వహించిన ఆ గ్రామానికి చెంది విశాఖపట్నంలో స్థిరపడ్డ పోలిశెట్టి వెంకట సుబ్బారావు,ప్రముఖ వ్యాపారవేత్త పోలిశెట్టి శ్రీనివాసరావు, పోలిశెట్టి మధుసూదన్ రావు, పోలిశెట్టి గణపతి రావు, పోలిశెట్టి బుల్లయ్య, పోలిశెట్టి శ్రీ రఘురామ రావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. వివిధ రంగాల్లో పనిచేస్తున్న ప్రముఖులను, న్యాయవాదులను, ఉపాధ్యాయుల దంపతులను పూలమాలలు వేసి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ముఖ్య అతిథులుగా డాక్టర్ సత్యనారాయణ రావు, గోపాల కృష్ణ గోఖలే, న్యాయవాది పోలిశెట్టి సూరిబాబు, పోలిశెట్టి సత్తిబాబు తదితరులు మాట్లాడుతూ పోలిశెట్టి వారు ఏ ఊర్లో ఉన్న ఎక్కడ ఉన్న అందరూ ఒకటేనని పదిమందికి తలలో నాలుకలా ఉండి సమాజంలో మంచి పేరు తెచ్చుకోవాలని చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ ఆత్మీయ సమావేశంలో మహిళలకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భముగా ఏర్పాటు చేసిన సంగీత విభావరి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.న్యాయవాది పోలిశెట్టి బాబ్జీ , పోలిశెట్టి ప్రసాద్. పోలిశెట్టి,దినేష్ ,పోలిశెట్టి సాంబ, పోలిశెట్టి అప్పాజీ ,రమేష్, సురేష్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమములో న్యాయవాది పోలిశెట్టి సుభాషిణి,సుభాషిణి దేవి, నళిని తదితరులు పాల్గొన్నారు.

# గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించాలి



## : జిల్లా కలెక్టర్ నాగరాణి

భీమవరం,మేజర్ న్యూస్: జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఈనెల 26న కలెక్టరేట్ పెరేడ్ గ్రౌండ్ లో 76వ భారత గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్లోని వశిష్ట సమావేశ మందిరంలో గణతంత్ర వేడుకలకు సంబంధించి అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి పలు ఆదేశాలు, సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. జిల్లా పోలీసు అధికారి ఆధ్వర్యంలో యధావిధిగా కార్యక్రమాల నిర్వహణతోపాటు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు, ట్రాఫిక్ సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. స్వాతంత్ర సమరయోధులు, ప్రజా ప్రతినిధులు, ఇతర అతి ధులకు సంబంధించి సిట్టింగ్ అరేంజ్మెంట్స్ చర్యలు తీసుకోవాలని తెలిపారు. అలాగే దేశభక్తి గీతాలతో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించేలాగా ఏర్పాట్లు చేయాలని డిఈఓ కు కలెక్టర్ తెలిపారు. రెవెన్యూ, విద్యుత్తు, మునిసిపల్, పోలీసు, సమాచార శాఖ, సంక్షేమ శాఖలు, విపత్తు అగ్నిమాపక శాఖ, వైద్య ఆరోగ్య, పౌర సరఫరా తదితర శాఖ అధికారులు సమన్వయంతో కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. ఈసమావేశంలో డిఆర్ఓ మొగిలి వెంకటేశ్వర్లు, అడిషనల్ ఎస్.పి వి.భీమారావు, ఆర్డీవో కె .ప్రవీణ్ కుమార్ రెడ్డి, డిఈవో ఇ.నారాయణ, ఏపిసి పి.శ్యాంసుందర్, డిపిఆర్ఓ టి.నాగేశ్వరరావు, డిపిఓ బి.అరుణశ్రీ, డిఏఓ జెడ్.వెంకటేశ్వరరావు, డ్వామా పిడి డా.కె.సిహెచ్ అప్పారావు, ఇరిగేషన్ అధికారి నాగార్జున రావు,జిల్లా మత్స్యశాఖ అధికారి ఆర్.వి.ప్రసాద్, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ బివివి. నాగేశ్వరరావు,జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి బి.శ్రీనివాసరావు, డిఎం సివిల్ సప్లైస్ మేనేజరు టి.శివ రామప్రసాద్, డీఎస్ఓ ఎన్.సరోజ,డి ఎం అండ్ హెచ్ ఓ డా.భాను నాయక్,జిల్లా ఉద్యానవన శాఖ అధికారి మురళీకృష్ణ, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి యు.మంగపతిరావు,జిల్లా చేనేత అధికారి అప్పారావు,డీఎఫ్ఓ డి.ఆశా కిరణ్, తహసిల్దార్ రావి రాంబాబు, వివిధ శాఖల జిల్లా అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# క్వారీ లారీ డ్రైవర్ల జీతాలు పెంచాలి - బోనస్ కొనసాగించాలి

**తాడేపల్లిగూడెం,మేజర్ న్యూస్ :** జీతాలు పెంచాలి. బోనస్ కొనసాగించాలి అంటూ క్వారీ లారీ డ్రైవర్లు ఆందోళన బాట పట్టారు. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం రూరల్ మండలంలోని ఆరుగొలను, కొత్తూరు,నవాబుపాలెం, దండగర్ర గ్రామాల పరిధిలో ఎర్ర కంకర క్వారీలు ఉన్నాయి. ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి వేతనాలు పెంచుతూ ఒప్పందం జరుగుతుంది. అలాగే ప్రతి ఏటా సంక్రాంతి పండుగకు బోనస్ కూడా ఇస్తారు. అయితే చివరిగా 2022లో వేతనాలు పెంచుతూ యజమానులకు, కార్మికులకు మధ్య ఒప్పందం జరిగింది. గత ఏడాది 2024లో తిరిగి ఒప్పందం జరగవలసి ఉంది. కానీ నేటి వరకు జరగలేదు. సంక్రాంతి పండుగకు ఇచ్చే బోనస్ ఈ ఏడాది ఇచ్చినప్పటికీ, వచ్చే ఏడాది నుంచి ఇచ్చేది లేదని యజమానులు చెప్పడం పట్ల కార్మికుల్లో ఆందోళన వ్యక్తం అవుతుంది. నవాబుపాలెం గ్రామంలోని కృషి లారీ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో యూనియన్ సభ్యులంతా సమావేశమై ఆందోళన చేపట్టాలని నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం ఉదయం హైవే పక్కన గల ఆటోనగర్ ముఖద్వారం వద్ద ఆందోళనకు దిగారు. వేతనాలు పెంచుతూ ఒప్పందం చేసుకోవాలని, బోనస్ ఇచ్చే విధానాన్ని కొనసాగించాలని కార్మికులు డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో అసోసియేషన్ ప్రెసిడెంట్



ఉండ్రాజవరపు యేసు రత్నం,సెక్రటరీ దొండపాటి శేషు కుమార్, ట్రెజరర్ మార్లపూడి సూరిబాబు, తానేటి శ్రీను, ముప్పిడి అశోక్, మాముడూరి సతీష్, కోనపో నాగరాజు, అయినవిల్లి ప్రసాద్, దున్న రంగా, మందా రాజు, పలువురు డ్రైవర్లు పాల్గొన్నారు.

# సిసి రోడ్లకు శంకుస్థాపన చేసిన శాసనసభ్యులు బొలిశెట్టి





**తాడేపల్లిగూడెం,మేజర్ న్యూస్ :** తాడేపల్లిగూడెం పట్టణంలోని 15వ వార్డు సవిత్రుపేట సంత మార్కెట్ నుండి కబేళ వరకు 98.00 లక్షల రూపాయల అంచనా వ్యయంతో సి.సి. రోడ్ శంకుస్థాపన కార్యక్రమానికి తాడేపల్లిగూడెం శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు. 28వ వార్డులో 10.5 లక్షలతో సిసి రోడ్డుకు శంకుస్థాపన చేశారు. 30వ వార్డు కట్టా వారి వీధిలో 17 లక్షల వ్యయంతో ఏర్పాటు చేయనున్న సిసి రోడ్డుకు శంకుస్థాపన చేశారు. వారితో పాటు స్థానిక 15వ వార్డు, 28వ వార్డు జనసేన పార్టీ నాయకులు అడబాల రామారావు, నంద్యాల కృష్ణమూర్తి, మెరుగు రాజగోపాల్ ,పత్యాల వెంకన్న, వాసా శ్రీను, వాసా కృష్ణ, గారపాటి వేణు, రాము లక్ష్మణ్, యాకోబు యెహోనా,మాజీ కౌన్సిలర్ చుక్క కన్నమనాయుడు, జనసేన పార్టీ పట్టణ అధ్యక్షులు వర్తనపల్లి కాశి,15వ వార్డు జనసేన నాయకులు, కార్యకర్తలు, కూటమి నాయకులు వలవల బాబ్జి,నరిసే సోమేశ్వరరావు,పాలూరి వెంకటేశ్వరరావు, అడబాల నారాయణమూర్తి, గుండుమోగుల సురేష్, పైబోయిన వెంకట్రామయ్య, అడ్డగర్ల సూరి,యంట్రపాటి రాజు,చేపల రమేష్ వారితో పాటు తాడేపల్లిగూడెం మున్సిపల్ కమిషనర్ యేసు బాబు, మున్సిపల్ ఇంజనీర్ వెంకటరమణ,డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పవన్, తదితరులు పాల్గొన్నారు.

# మస్కట్‌లో నరకయాతన పడుతున్న తమ వారిని రప్పించండి

### – ఎమ్మెల్యే బాలరాజును కోరిన కుటుంబ సభ్యులు



**జీలుగుమిల్లి,మేజర్ న్యూస్ :** మస్కట్‌కు ఉపాధి కోసం వెళ్లి నరకయాతన పడుతున్న భార్యాభర్తలను స్వదేశానికి రప్పించాలని కుటుంబ సభ్యులు శుక్రవారం శాసనసభ్యులు చిర్రి బాలరాజుకు మొరపెట్టుకున్నారు. శుక్రవారం బర్రింకలపాడు లోనే క్యాంపు కార్యాలయం వద్ద ఎమ్మెల్యే బాలరాజుకు వినతి పత్రాన్ని అంద జేశారు. ఈ సందర్భంగా స్పందించిన ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడి తక్షణ చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా మస్కట్‌లో ఉన్న మద్దాల కృష్ణ మద్దాల మహేశ్వరి లకు ఎటువంటి ఇబ్బంది లేకుండా స్వదేశానికి తన ఇంటికి రప్పించేందుకు కృషి చేస్తానని బాధితులకు కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు. ఏజెంట్ లను నమ్మి డబ్బు పోగొట్టుకోవడమే కాకుండా ఇబ్బందులకు గురవు తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి సంఘటనలు జరగకుండా రానున్న రోజుల్లో పట్టించుట చర్యలు చేపడతామని అన్నారు. అక్రమ పద్ధతిలో సొమ్ము చేసుకునే ఏజెంట్ల పై చర్యలు తీసుకోవాలని జీలుగుమిల్లి పోలీసులను ఆదేశించారు.

# పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచండి



## : మున్సిపల్ కమిషనర్

నరసాపురం,మేజర్ న్యూస్: పట్టణ పరిశుభ్రతలో భాగంగా ప్రజలందరూ తమ ఇంటి నుండి, లేదా వ్యాపార సముదాయముల నుండి వెలువడే చెత్తను,తడిచెత్త పొడి చెత్త వేరు చేసి డస్ట్ బిన్ ల ద్వారా తమ ఇంటి ముందుకు వచ్చే మున్సిపల్ పారిశుద్ధ్య వాహనములకు అంద జేయాలని మున్సిపల్ కమిషనర్ ఎం అంజయ్య ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి అందించని యెడల వారి చెత్తను తీసుకొనుట జరగదని,చెత్తను రోడ్లపై, డ్రెయిన్‌లలో, ఖాళీ స్థలములలో పారవేసిన వారికి జరిమానా విధించబడునని కమిషనర్ తెలిపారు.

# ఉత్కంఠ భరితంగా కొనసాగుతున్న జాతీయస్థాయి కబడ్డీ పోటీలు





నర్సాపురం,మేజర్ న్యూస్: శ్రీ గోగులమ్మ తల్లి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు, మాజీ ఎమ్మెల్యే కొత్తపల్లి జానకి రామ్‌ల సారధ్యంలో జరుగుతున్న జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు ఉత్కంఠ భరితముగా కొనసాగుతున్నాయి. శుక్రవారం కలకత్తా ఢిల్లీ, పురుషుల జట్ల మధ్య జరిగిన పోటీలో 24 పాయింట్లతో కలకత్తా టీం గెలుపొందింది. గొందియ మహారాష్ట్ర, వెస్ట్ బెంగాల్ జట్ల మధ్య జరిగిన పోటీలో 15 పాయింట్లతో మహారాష్ట్ర టీం గెలుపొందింది.

జమ్మూ కాశ్మీర్,కలకత్తా టీములు మధ్య జరిగిన పోటీలో 30 పాయింట్లతో కలకత్తా టీం గెలుపొందింది. మహిళా విభాగంలో కలకత్తా,పటియాల మధ్య జరిగిన పోటీలో 22 పాయింట్లు కలకత్తా టీం గెలుపొందింది. ఢిల్లీ,పటియాల టీముల మధ్య జరిగిన పోటీలో 29 పాయింట్లతో ఢిల్లీ టీమ్ గెలుపొందింది. కేరళ,వైఎంసిఏ ఫరీదాబాద్ మధ్య జరిగిన పోటీ డ్రా అయ్యింది. పోటీలను తిలకించేందుకు పెద్ద ఎత్తున అభిమానులు హాజరయ్యారు. ఉత్సవ కమిటీ కన్వీనర్ కొత్తపల్లి జానకిరామ్ తదితరులు పోటీలను పర్యవేక్షించారు.

# వైసిపి పాలకుల చెర నుండి ఏలూరుకు విముక్తి కల్పించడమే ధ్యేయం





## - ఎమ్మెల్యే బడేటి చంటి వ్యాఖ్య

**ఏలూరు,మేజర్‌న్యూస్:** గత వైసిపి పాలకులు తమ దుర్మార్గపాలనలో సృష్టించిన సమస్యల చెరనుండి ఏలూరు నియోజకవర్గానికి విముక్తి కల్పించడమే తన ధ్యేయమని ఎమ్మెల్యే బడేటి చంటి వ్యాఖ్యా నించారు. ఇదేక్రమంలో ఏలూరు నగరంలో ఎక్కడా ట్రాఫిక్ సమస్య ఉత్పన్నం కాకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇదేక్రమంలో శుక్రవారం ఏలూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి పలువురు తమ వినతులందించేందుకు క్యూకట్టారు.
తనను కలిసేందుకు వచ్చిన ప్రతిఒక్కర్నీ ఆప్యాయంగా పలకరించిన ఎమ్మెల్యే బడేటి చంటి నేనున్నానంటూ వారికి భరోసా కల్పించారు. అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. ఏలూరు పత్తేబాద రైతుబజార్ వద్ద పార్కింగ్ అంశంపై ప్రత్యేక దృష్టిసారించాలని ఏలూరు ట్రాఫిక్ సిఐ ఎస్.లక్ష్మణరావును ఆదేశించారు. నగరంలో ఎక్కడా ట్రాఫిక్ సమస్యల లేకుండా చూడాలని సూచించారు.

గత వైసిపి పాలకులు చేసిన అరాచక పాలనతో ఏలూరు నియోజక వర్గంలో అనేక ప్రజా సమస్యలు తిష్టవేశాయన్నారు. వాటన్నింటినీ దశలవారీగా పరిష్కరించేందుకు కృషిచేస్తున్నానని అన్నారు. ప్రజలు కూడా తమ సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కో-ఆప్షన్ సభ్యులు చోడే వెంకటరత్నం, టిడిపి నాయకులు పెద్ది బోయిన శివ ప్రసాద్ త్రిపర్ణ రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ ప్రతిభను కనబరిచిన 10 విద్యార్థులకు నగదు బహుమతులు

చింతలపూడి,మేజర్ న్యూస్: ప్రతి సంవత్సరం పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభను కనబరిచిన విద్యార్థులకు చింతలపూడి ఇబ్రహీం మెరిట్ స్కాలర్‌షిప్ తరఫున నగదు బహుమతి అందజేస్తారు. ఈ కార్యక్రమంలో భాగంగా గత సంవత్సరం 10వ తరగతి పరీక్షలు పరీక్షల్లో మంచి మార్కులు సాధించిన ముగ్గురికి ఈ నగదు బహుమతిని అందజేశారు. మసీదు కమిటీ ముతవల్లి రహీం, వైస్ మతవల్లి అక్బర్ ఆలీ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో 10వ తరగతిలో సాహిల్( 93.83శాతం)కు ప్రథమ బహుమతి పదివేల రూపాయలను, మొహిద్దిన్ (88.5శాతం)ద్వితీయబహుమతి6వేల రూపాయలు, సిరాజ్ (85.5శాతం) కు తృతీయ బహుమతులను ట్రస్ట్ అధినేత సయ్యద్.రషీద్, అందజేశారు. ఈ కార్యక్రమం లో సెక్రటరీ జిలానీ, నవాబ్,ఇస్మాయిల్, ఆర్టీసీ అలీ,భక్షు, రఫీ, ఇమ్రాన్, పాషి తదితరులు ముస్లిం సోదరులు పాల్గొన్నారు.



# అక్షజ ప్రాజెక్టులో సెయింట్ థెరెసా కాలేజి భాగస్వామ్యం






## - గత కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ప్రోత్సాహంతో 3 మండలాలు దత్తత

**ఏలూరు,మేజర్‌న్యూస్:** జిల్లాకు దేశవ్యాప్తంగా పేరు ప్రఖ్యాతలు తెచ్చిపెట్టిన అక్షజ ప్రాజెక్టులో తమ కళాశాల కూడా భాగం కావడంతో డాక్టర్ సిస్టర్ పి.మెర్సీ ఎంతో గర్వంగా ఉందన్నారు. స్థానిక సెయింట్ థెరెసా మహిళా స్వయం ప్రతిపత్తి కళాశాలలో నిర్వహించిన ఒక కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్ మెర్సీ అక్షర ప్రాజెక్టును గురించి వివరించారు. అప్పటి జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ చొరవతో ఏలూరు జిల్లాలోని 3 గిరిజన మండలాలు బుట్టాయిగూడెం, టి .నరసాపురం,జీలుగుమిల్లిలో పోషకాహార లోపంతో ఉన్న ఆరేళ్లలోపు పిల్లలను 999 మందిని గుర్తించి వారికి అంగన్వాడి ఆహారంతో పాటుగా 6 నెలల పాటు ప్రోటీన్ పౌడర్ ను అందించడం జరిగింది. అలాగే ఆయా ప్రాంతాల్లోని 232 మంది రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణీ స్త్రీలకు మునగాకుతో చేసిన లడ్డూలను ఇవ్వడం జరిగింది. దీని కారణంగా ఆ పిల్లల్లో బరువు ఎత్తు పెరగగా, గర్భిణీ స్త్రీలలో రక్తంలో హిమోగ్లోబిన్ శాతం పెరిగినట్లు నిర్ధారించారు. ఈ ప్రాజెక్టును గత సంవత్సరం అక్టోబర్ నుంచి మార్చి నెల వరకు ఆరు నెలల కాలం కొనసాగించగా మంచి ఫలితాలు వచ్చాయి అన్నారు. అప్పటి కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆధ్వర్యంలో, డిఎం హెచ్ ఓ, ఐసి డిఎస్, మార్పు ట్రస్ట్ , సెయింట్ థెరెసా మహిళా స్వయం ప్రతిపత్తి కళాశాల భాగస్వాములుగా ఈ కార్యక్రమాన్ని నిర్వర్తించడం జరిగింది. ఈ కార్యక్రమ నిర్వహణలో ప్రాతినిధ్యం వహించిన తమ కళాశాల అధ్యాపకులు డాక్టర్ జ్యోతి కుమారి,డాక్టర్ పద్మజలను ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్ మెర్సీ అభినందించారు. ఈ ప్రాజెక్టులో పాల్గొనడం తమకు ఎంతో ఆనందంగా ఉందని,తమని ఈ ప్రాజెక్టులో భాగం చేసిన జిల్లా యంత్రాంగానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ ప్రాజెక్టులో పని చేయడం ద్వారా తమ విద్యార్థినులు ప్రోటీన్ పౌడర్ ,లడ్డూల తయారీతో పాటుగా డేటా ఎనాలసిస్ లో ప్రావీణ్యం సంపాదించారని తెలియజేశారు.

# పోలీసుల సంక్షేమ దివాస్‌కు పలు సమస్యలు

## - పరిష్కారానికి జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్ హామీ



**ఏలూరు,మేజర్‌న్యూస్:** జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన పోలీస్ సిబ్బంది సంక్షేమ దివస్‌లో జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్ విధుల్లో నిమగ్నమైన పోలీస్ సిబ్బంది, ఏ.ఆర్. సిబ్బంది ,హెూం గార్డ్స్‌ల సమస్యలను నేరుగా తెలుసుకున్నారు. వివిధ పోలీస్ స్టేషన్‌లు ,విభాగాల నుండి వచ్చిన సిబ్బంది తమ సమస్యలను ఎస్పీతో విన్నవించారు. ఎస్పీ ప్రతి సమస్యను జాగ్రత్తగా తెలుసుకొని సానుకూలంగా స్పందిస్తూ వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఎస్పీ సిబ్బందితో నేరుగా సంభాషించి,వారి సమస్యలను అర్థం చేసుకున్నారు. సిబ్బంది అన్ని సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశించిన జిల్లా ఎస్పీ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

# కల్వారి చర్చి నిర్మాణంపై దుష్ప్రచారాలు ఆపాలి



**ఏలూరు,మేజర్‌న్యూస్ :** గుంటూరు జిల్లా నంబూరు లో కల్వారి చర్చి నిర్మాణం పై దుష్ప్రచారాలు ఆపాలని, క్రైస్తవులు చేసేది మత ప్రచారాలు, మతమార్పిడులు కాదని,అది మనసు మార్పు అని నేషనల్ దళిత జేఏసీ చైర్మన్ పెరికె వర ప్రసాదరావు పేర్కొన్నారు. ఎవరో ఒక అజ్ఞాత వ్యక్తి పీఎం ఆఫీసులో ఫిర్యాదు చేస్తే చర్చి పర్మిషన్ క్యాన్సిల్ చేయటం దుర్మార్గమని, రెవిన్యూ పర్మిషన్,శబ్ద కాలుష్య పర్మిషన్,పంచాయతీ రాజ్ పర్మిషన్,పోలీస్ పర్మిషన్,వంకతో చర్చిలు పర్మిషన్లను ఇబ్బంది పెట్టటం తగదని, కల్వారి టెంపుల్ పై విషప్రచారం మానుకోవాలని,కల్వారి టెంపుల్ అధినేత సతీష్ కుమార్ అన్ని పర్మిషన్లు తీసుకునే చర్చిలు నిర్మిస్తున్నారని అన్ని కూడా చట్టబద్ధతంగా లీగల్ గానే ఉన్నాయని పేర్కొన్నారు. కొంతమంది కావాలనే ప్రముఖ దైవ సేవకులు సతీష్ కుమార్ పై దుష్ప్రచారం చేస్తున్నారని, తక్షణమే ఇలాంటి చర్యలు మానుకోవాలని లేదా హిందూ భారతదేశంలో హిందూ దేవాలయాలు ఎక్కడా కూడా పరిమిషన్ లేవని అవన్నీ కూడా బయటికి తీయాలని చైర్మన్ పెరికె వరప్రసాదరావు డిమాండ్ చేశారు. డాక్టర్ సతీష్ కుమార్ కరోనా టైం లోను, ఇటీవల విజయవాడలో వచ్చిన వరదల లోను బాధితులకు అనేకమందికి అనేక రకాలుగా మెడికల్ క్యాంపులు,నిత్యవసర వస్తువులు పంపిణీ చేయడం జరిగిందని అలాంటి మానవతావాదిని ఇబ్బందులకు గురి చేయొద్దని, ఈఅంశంపై త్వరలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని కలుస్తామని తెలిపారు. రాష్ట్రంలో క్రిస్టియన్ల కు,చర్చిలకు రక్షణ కల్పించాలని ఆయన కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు.